క్లుప్తంగా

విప్లవ కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ



చిలకలూరిపేటటౌన్: విప్లవ కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ అని ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. గురువారం పట్టణంలో శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నవకవితకు నాందీ పలికి, ఈ యుగం నాది అని గర్వంగా చెప్పిన ఆధునిక కవి శ్రీశ్రీ అని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ప్రస్థానం చిరస్థాయిగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, గ్రంధాలయ ఇన్‌చార్జి నాగుర్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి స్నపన తిరుమంజనం

నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మా వతి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామివారి 12వ మహా కుంభాభిషేక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం శ్రీవారికి అష్టోత్తర శతకలశ స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నీటిని సంరక్షించుకోవాలి



నరసరావుపేట ఈస్ట్: నీటి సంరక్షణ పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతతో మెలగాలని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, గుంటూరు నెహ్రూ యువకేంద్ర, ఎడ్యుకేట్ ది సొసైటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో క్యాచ్ ది రైన్ ప్రాజెక్ట్ ఫేజ్-3లో భాగంగా నీరు పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని నాతాని సూచించారు. నీటి ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు సమాజాన్ని చైతన్యపరిచేలా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్.అన్సారీ, ప్రోగ్రామ్ ఆఫీసర్ సి.హెచ్.అప్పలరాజు, జి.రమణ, వినయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు సాగు ధ్రువీకరణ పత్రాలు

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు అన్నదాతలు అర్హత కౌలు రైతులు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు కోసం రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ బోయపాటి రవిబాబు కోరారు. గురువారం స్థానిక రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 10 వేల మంది కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో పోలేరమ్మ కొలుపులు

బొల్లాపల్లి: మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లి కొలుపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపుకుంకుమ సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారు చల్లని దయతో గ్రామస్తులు సుఖసంతోషాలతో పాడిపంటలతో కలకాలం జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గడ్డివామి దగ్ధం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో గురవారం వరిగడ్డి వామి దగ్ధమైంది. స్థానిక రైతు బోరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తమ పశువుల కోసం గ్రామంలోని జెడ్పీహైస్కూల్‌కు వెళ్లే మార్గంలోని ఖాళీ ప్రదేశంలో వామికట్టి నిల్వ చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం గడ్డివామి వద్ద ఉన్న విద్యుత్ తీగలు గాలికి రాచుకుని నిప్పురవ్వలు వామిపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ సందర్భంగా బాధిత రైతులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తమకు కట్టుబడి పడ్డ, రెండు పాలిచ్చే గేదెలతో పాటు రెండు దూడలు ఉన్నాయన్నారు. వీటికోసం పొన్నూరు ప్రాంతం నుంచి రూ.లక్ష వెచ్చించి జొన్నసొప్ప, వరిగడ్డిని తీసుకువచ్చినట్లు తెలిపారు. తీరా వామిమొత్తం దగ్ధమై ఏమీ మిగల్లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- బలోపేతం చేసిన ఘనత జగనన్నదే
- మంత్రి విడదల రజిని
- ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ సెకండియర్‌లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు ఆమె చేతుల మీదుగా అందించారు. విద్యార్థులకు నగదుతో పాటు మెమొంటో, సర్టిఫికెట్, శాలువాలతో సత్కరించారు.

నగదు అవార్డులు పొందిన విద్యార్థులు

చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన కొరిసెపాటి ప్రజ్వలకుమార్ (చిలకలూరిపేట శారద- 585 మార్కులు)కు రూ.15 వేలు నగదు, రెండో స్థానంలో నిలిచిన ప్రత్తిపాటి నాగయశ్వంత్ (గణపవరం జిల్లాపరిషత్- 578 మార్కులు) రూ.10 వేలు నగదు, మూడో స్థానంలో నిలిచిన కందుకూరి నవీన్ (గణపవరం జిల్లాపరిషత్ - 575 మార్కులు) రూ.5 వేలు నగదు అందించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో సందెపోగు సరళ (ఎంపీసీ-నాదెండ్ల కేజీబీవీ- 865 మార్కులు), గోళ్ళమూడి శైలజ (బైసీపీ- ఏపీ మోడల్ పాఠశాల, చిరుమామిళ్ళ -950 మార్కులు) చావా బ్యూలా (సీఈసీ-ఏపీ మోడల్ పాఠశాల, చిరుమామిళ్ళ - 907 మార్కులు)లకు ఒక్కొక్కరికీ రూ.15 వేలు నగదు, మెమొంటో, సర్టిఫికెట్ అందించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట నియోజకవర్గంలో ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.6.07 లక్షల చెక్కులను లబ్ధిదారులకు మంత్రి రజిని చేతుల మీదుగా అందించారు. యడ్లపాడు మండలం, కొత్తపాలెంకు చెందిన ఐలాం నిరోషాకు రూ.2.10 లక్షలు, చిలకలూరిపేట గుర్రాలచావిడికి చెందిన షేక్ నాగూర్‌కు రూ. 2 లక్షలు, యడ్లపాడు మండలం, కారుచోలకు చెందిన జాజుల సాంబయ్యకు రూ.1 లక్ష చెక్కులను ఆయా గ్రామ నాయకులతో కలిసి అందించారు.

వరుసగా నాలుగో ఏడాది జేవీకే కిట్లు

ప్రతి ఏడాది పాఠశాలల ప్రారంభం అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లు వరుసగా నాలుగో ఏడాది పంపిణీ చేశారు. నాదెండ్లలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఆమె చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు నేడు కార్యక్రమం ద్వారా మూడు విడతల్లో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనంలో మార్పులు, అమ్మఒడి పథకం ద్వారా విద్యా రంగం అభివృద్ధి చెంది ప్రభుత్వ పాఠశాలల్లో ఏ ఏడాదికి ఆ ఏడాది సంఖ్య పెరుగుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగిందన్నారు. ఈ ఏడాది వచ్చే నెలలో వంట చేసేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు అందుబాటులో తెచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా బైజూస్ కంటెంట్ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల, గణపవరం సొసైటీ అధ్యక్షులు కురుకుట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, శ్రీలక్ష్మి, హెచ్‌ఎం నిర్మల, ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్వో మాధవీలత, రూరల్ ఎంపీపీ దేవినేని శంకరరావు, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- జగనన్న ఆణిముత్యాలకు సత్కారం



విద్యార్థులకు నగదు పురస్కారం, జ్ఞాపికలు అందచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: దేశంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఏకైక రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యను పెట్టుబడిగా గుర్తించి పేదలు చదువుకొనే ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించటంతో పాటు ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి విద్యార్థుల జీవితాలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి బంగారు బాట వేస్తున్నారని కొనియాడారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలులో భాగంగా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందచేశారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం కేటాయించనంతగా బడ్జెట్‌లో విద్యారంగంపై అధిక శాతం నిధులను జగనన్న ప్రభుత్వం కేటాయిస్తున్నదని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగ పరుచుకొని విద్యార్థులు అభివృద్ధి బాట పట్టాలని హితవు పలికారు. కాగా, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన షేక్. తస్లీమా కౌసర్ (584 మార్కులు)కు రూ.15 వేలు, కె.నాగఅభయ వరలక్ష్మి (582 మార్కులు) రూ.10 వేలు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి శివ కార్తీక్ (580 మార్కులు)కు రూ.5 వేలు అందచేశారు. అలాగే ఇంటర్మీడిమెట్‌లో గ్రూప్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఆర్.శ్రీనిధి (బైపీసీ), ఏ.అఖిల (ఎంపీసీ), కె.అమృత (సీఈసీ)లకు ఒక్కొక్కరికి రూ.15 వేలు నగదు పురస్కారం, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందచేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి నీలావతి దేవి, డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈ.ఎం.స్వామి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎ.ఎ.మధుకుమార్, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.సులేఖ, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రవికాంత్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నూజెండ్ల గ్రామంలో గ్రామసచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న గ్రామసచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్లలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రాముడుపాలెం గ్రామంలో హెల్త్ సెంటర్ నూతన భవనాలను గురువారం ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గ్రామపరిపాలన వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతూ గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌ల నిర్మాణంతో పాటు గ్రామ వలంటీర్లను నియమించి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. ఒక వైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతూ ప్రతి గ్రామంలో కోట్ల రూపాయల అభివృద్ధి జరిగిందన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై రెండు వంతెనల నిర్మాణం, ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.

ప్రతిపక్ష నాయకులకు ఇలాంటి అభివృద్ధి పనులు కనిపించకపోవడంతో కళ్లుండి చూడలేని గుడ్డివారిలా తయారయ్యారని విమర్శించారు. నియోజకవర్గంలో తాము చేపట్టిన అభివృద్ధి పనులకు అడుగడుగునా కోర్టులకు వెళ్లి ఆటంకాలు కలిగించడం తప్ప మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నియోజకవర్గ అభివృద్ధిని ఆపలేరని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంలా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ మధుబాబు, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మండల పార్టీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, స్థానిక నాయకులు ఒంగూరి ప్రసాద్, మల్లంపాటి అంజిరెడ్డి, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిలతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీటినిల్వలు ఉండనివ్వొద్దు



చిలకలూరిపేట: ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండడం వలన దోమల వ్యాప్తి జరిగే ప్రమాదం ఉందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్ సీహెచ్ నారాయణ చెప్పారు. డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎంసీఆర్ మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు డెంగీ, మలేరియా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు గుడ్లు పెట్టి దోమల వ్యాప్తి జరుగుతుందన్నారు. ఖాళీ నీటి తొట్లు, తాగి పడవేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు ప్రబలి మలేరియా, బోదకాలు, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీటి తొట్లపై కూడా మూతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు, కిటికీలకు మెస్‌లు ఉపయోగించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి పాఠశాల ఆవాస ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది ఎన్ శివయ్య, ఎస్‌వీ చలమారెడ్డి, బీఎస్ కోటేశ్వరరావు, షేక్ జిలాని, స్కూల్ హెచ్‌ఎం కె.సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ అండ్ ఎన్ విద్యార్థినికి 7వ ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ బోర్డు ప్రకటించిన జూనియర్ ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇంటెన్సివ్ క్యాంపస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య గురువారం తెలిపారు. తమ విద్యార్థులు జి.మోహిత 460 మార్కులతో స్టేట్ 7వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. అలాగే జె.అశ్విని 458 మార్కులు, డి.సువర్ణదీపిక 450 మార్కులు, బైపీసీ విభాగంలో జె.అక్షయ పురుషోత్తం 424 మార్కులు, సీఈసీ విభాగంలో ఎస్.వాణి 394 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల పాలక వర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఇంటర్మీడియేట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, డాక్టర్ పి.ఎస్.వి.డి. మహేష్, అధ్యాపకులు అభినందించారు.

పేదవిద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అండ

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదని పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా మంచిమార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయల నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు పేద విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజురీయింబర్స్ మెంట్, జగనన్న విద్యాకానుక వంటి అనేక పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో నూజెండ్ల మోడల్ స్కూల్‌కు చెందిన నుసుం ధనలక్ష్మి, వినుకొండ జూనియర్ కళాశాలకు చెందిన కోంద్రు జ్యోతి, బొల్లాపల్లి మండలం మోడల్ స్కూల్‌కు చెందిన సామంతపూడి చైతన్య, వినుకొండకు చెందిన పల్లె పవన్‌లకు రూ.15 వేలు చొప్పున నగదు బహుమతి, గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే 10వ తరగతి పూర్తి చేసిన జక్కి వెంకటేష్, చిన్నకొండ రోహిత్, గంగిశెట్టి కుసుమ, సూరి ప్రేమ్‌సాగర్‌లకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలతో పాటు పథకాలను సద్వినియోగించుకుని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీరాములు, ఎంఈవోలు జఫ్రుల్లా, సాంబశివరావు, ఎంపీపీలు జయశ్రీ వెంకటరామిరెడ్డి, జయరామిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్‌చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, మాజీ ఎంపీపీ ములకా రామ తులసి రెడ్డి, కౌన్సిలర్ షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా పాల్గొన్నారు.

మళ్లీ అధికారం చేపట్టేది జగనన్న ప్రభుత్వమే

- నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- సంతగుడిపాడు గ్రామంలో టీడీపీ నుంచి 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీకి చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో సంతగుడిపాడు గ్రామంలో ఎమ్మెల్యే గురువారం పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని కాలనీలో పర్యటించి రూ. 25 లక్షల రూపాయలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని కుయుక్తులు వేసినా ప్రజలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైపు ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, తాను శాసనసభ్యునిగా గతం కంటే అధిక మెజార్టీతో గెలుపొందుతానన్నారు. ఈ గ్రామంలో గల కాలనీలో రూ. 25 లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం శంకుస్థాపన చేయటం పట్ల సంతోషంగా ఉందన్నారు. అనంతరం కాలనీలో టీడీపీకి చెందిన 15 కుటుంబాల వారు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే సంతగుడిపాడు, విప్పర్ల గ్రామాల్లో పర్యటించి పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల నివాసాల్లో నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ మాజీ సర్పంచ్ పల్లకి అంజనారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కురుగంటి శ్రీనివాసరెడ్డి, గానుగపంట ఉత్తమ రెడ్డి, ఒద్దుల సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి



భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి

నరసరావుపేట రూరల్: భూమికి అవసరమైన పోషకాలను అందించి అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని యల్లమంద రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలు, వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్‌లు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి పర్యవేక్షిస్తుందని తెలిపారు. గతంలో భూసార పరీక్షలను మ్యానువల్‌గా నిర్వహించి ఫలితాలను అందజేసేవారని, తాజాగా ప్రత్యేక యాప్‌ను రూపొందించడం జరిగిందన్నారు. భూసార పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు. జిల్లాకు 38 వేల శ్యాంపిల్స్ లక్ష్యంగా ఇవ్వగా జూన్ నెలలో 10 వేల శ్యాంపిల్స్‌ను సేకరించామన్నారు. ఒక్కో ఆర్‌బీకే నుంచి 25 శ్యాంపిల్స్ సేకరించే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. భూమిలో సమస్యలు ఉన్న రైతులను గుర్తించి వారి నుంచి శ్యాంపిల్స్ సేకరించడం ద్వారా సత్ఫలితాలు వస్తాయని వివరించారు. వైఎస్సార్ యంత్ర సేవా యాప్‌లో రైతు గ్రూపు సభ్యుల అభిప్రాయాలు, అద్దె వివరాలు నమోదు చేయడంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. అలాగే యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, ఏఓ వి.నరేంద్రబాబు, ఏఈఓ బ్రహ్మయ్య, గోపిరెడ్డిలు పాల్గొన్నారు.

పాలపర్తికి ఘన సన్మానం



పాలపర్తిని సన్మానించిన గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు

నరసరావుపేట: ఏపీ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన పాలపర్తి వెంకటేశ్వరరావును ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు గురువారం ఘనంగా సన్మానం చేశారు. పాలపర్తిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా కార్యాలయంలో పూలదండలు వేసి శాలువా కప్పి వెంకటేశ్వరరావు రాజకీయ పయనాన్ని తలచుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేశారని, 2014లో నిర్వహించిన పురపాలక ఎన్నికల్లో 9వ వార్డుకు కౌన్సిలర్ ఎన్నికై మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ద్వారా ఇలాంటి మంచి పదవి రావడం పల్నాడు జిల్లాకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కుంభా నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు, కోశాధికారి బి.రాంబాబు నాయక్, నరసరావుపేట ఎస్టీ నాయకులు దేవరకొండ శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో యోగా వారోత్సవాలు

నాదెండ్ల: గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రియ విద్యాలయంలో గురువారం నుంచి యోగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.విజయకుమార్ తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్నామన్నారు. తొలిరోజు యోగాపై అవగాహన, యోగా చరిత్ర, ప్రాముఖ్యత, రెండోరోజు యోగా వలన ఉపయోగాలు, మూడో రోజు నిత్యజీవితంలో యోగాభ్యాసం, నాలుగరోజు సూర్యనమస్కారాలు, ఐదో రోజు యెగా సంగీతం, చివరిరోజు ట్రెనీ మాస్టర్ కీర్తి ఆధ్వర్యంలో యోగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా జాతర

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియ నగర్‌లో కొలువైయున్న గండిపోచమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి జాతర నిర్వహించారు. రాజమండ్రికి చెందిన దుర్గామల్లేశ్వర జానపద కళాబృందం మిరియాల నాగేంద్రబాబు ఆధ్వర్యంలో అమ్మవారి వేషాలతో నిర్వహించిన ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదిపరాశక్తి పీఠాధిపతి శ్రీ నిత్యవిద్యానంద భారతీస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి అమ్మవారి ఆలయంలో తొలి వార్షికోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. గురువారం అమ్మవారికి కుంకుమ పూజ, గణపతి పూజ, గోపూజ నిర్వహించారు. అనంతరం శాంతి హోమాలు, కుంభాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం, కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు.

సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోండి

చిలకలూరిపేటటౌన్: పల్నాడు జేసీ ఆదేశాల మేరకు రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు తహసీల్దార్ జి.సుజాత తెలిపారు. ఇందులో భాగంగా పసుమర్రు సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె ప్రారంభించినట్లు తెలిపారు. ఇకపై స్థానికంగానే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్టర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వాసు, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు, కొనకంచివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తల్లులకు పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్యపై వివరించారు. అభ్యాసన, నైపుణ్యాలకు సంబంధించిన కృత్యాలు చే యించారు. చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠ శాల సంసిద్ధత, సాంకేతిక వినియోగం, కథలు చెప్పటం, రంగో లీ వంటి కృత్యాలు చేయించటం జనభాగీదారి ముఖ్య ఉద్దేశం అని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు వి. పద్మ, ఆదిలక్ష్మి, సావిత్రి, రాజ్యలక్ష్మి, సౌభాగ్యం, ఎం. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24న మండల సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు.